నేడు ఇంటర్ వార్షిక ఫీజు చెల్లింపునకు చివరి తేదీ

హనుమకొండ సిటీ, జనవరి 2 : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక ఫీజు చెల్లించేందుకు రూ.2500 అపరాధ రుసుముతో బుధవారం వరకే చివరి అవకాశమని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి గోపాల్ ఒక ప్రకటన పేర్కొన్నారు. గడువును డిసెంబర్ 30 నుంచి ఈ నెల 3 వరకు పొడిగించినట్లు తెలిపారు. విద్యార్థులు సాయంత్రంలోగా పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

అవిశ్వాసంపై నోటీసు

నర్సంపేట, జనవరి 2: నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కౌన్సిలర్లు నోటీసు అందజేశారు. 12 మంది కౌన్సిలర్లు వరంగల్ కలెక్టరేట్‌లో మంగళవారం డీఆర్వోకు అందించారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

ఖిలావరంగల్, జనవరి 2: వరంగల్ జిల్లాలో పోస్టుమెట్రిక్ కోర్సులు చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులు కొత్త స్కాలర్‌షిప్‌లు, రెన్యువల్ కోసం మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవాలని బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకొని ఈ పాస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయించాలని పేర్కొన్నారు. హార్డ్ కాపీలను కళాశాల యాజమాన్యాలు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

వృత్తి శిక్షణ కోర్సులకు..

మడికొండ, జనవరి 2 : మడికొండ వ్యాసపురి కాలనీలోని సేవా భారతి, గోద్రెజ్ సంయుక్తంగా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేరుతో నిర్వహించనున్న వృత్తి శిక్షణ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకుడు రాసమల్ల మహేశ్ తెలిపారు. ఏసీ, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, మైక్రో ఓవెన్ తదితర గృహోపకరణాల రిపేరులో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. బుధవారం నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభం కానుందని, ఆసక్తిగల యువకులు 9059907740 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

9 నుంచి సదరం క్యాంపులు

ఖిలావరంగల్, జనవరి 2: వరంగల్ జిల్లాలోని దివ్యాంగుల కోసం సదరం క్యాంపు షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. మానసిక దివ్యాంగులకు ఈ నెల 9న, మూగ, చెవిటి వారికి 12న, శారీరక విభాగానికి చెందిన వారి కోసం 23, 23, 25 తేదీల్లో ఎంజీఎంలో క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే, కంటి పరీక్షకు సంబంధించి ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ఈ నెల 29న నిర్వహిస్తారని తెలిపారు. అర్హులు బుధవారం మీసేవ కేంద్రాల్లో స్లాట్స్ బుక్ చేసుకోవాలని సూచించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నాక్లయింట్ శ్రీమతి కొండా @ కోమటి సృజన, W/o కొండా హనుమాన్ ప్రసాద్, జ్యోతి రెసిడెన్సీ, కాకతీయ కాలనీ, హనుమకొండ గారి తండ్రి గారైన కోమటి వీరస్వామి, S/o సమ్మయ్య, గ్రా|| & మం|| శాయంపేట, జి|| హన్మకొండ వాస్తవ్యులు వయోభారం తీవ్రమైన అనారోగ్య సమస్యలతో అవసానదశలో ఉన్నాడు.

ఎవరైన నా క్లయింటు తండ్రి కోమటి వీరస్వామి గారితో ఏమైనా లావాదేవిలు, క్లయిమ్‌లు, లేదా ఆక్షేపణలు గాని ఉన్న యెడల నేటి నుండి (7) రోజులలో క్రింది అడ్రస్సు వారికి లిఖిత పూర్వకముగా తగు సాక్ష్యాధారాలతో తెలియజేయగలరు. లేని యెడల ఎవ్వరికి ఎలాంటి లావాదేవిలు, ఆక్షేపణలు, క్లయిమ్‌లు గాని లేవని భావించి భవిష్యత్తులో ఏకైక వారసురాలిగా నా క్లయింట్ తీసుకునేదే తుది నిర్ణయముగా భావించాల్సి వస్తుందని ఇందుమూలముగా తెలియజేయనైనది.

సం/- **మేరుగు శ్రీనివాస్** అడ్వకేట్
ఇ.నెం. 3-570/1, వెల్లంపల్లి రోడ్, పరకాల, జి|| హనుమకొండ.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319403-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

న్యూశాయంపేట : దరఖాస్తును స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ మానస

హసన్‌పర్తి : సూదన్‌పల్లిలో నిర్వహించిన ప్రజాపాలన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

నర్సంపేట రూరల్ : లక్నేపల్లి గ్రామంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నాలుగో రోజూ 'ప్రజా పాలన'

- గ్రామ సభల్లో దరఖాస్తులతో బారులు తీరుతున్న ప్రజలు
- పలు చోట్ల స్వీకరించిన ప్రజాప్రతినిధులు

ధర్మసాగర్ : మల్లక్‌పల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 30: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం నాలుగో రోజు కొనసాగింది. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని అన్ని మండలాల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. హనుమకొండ జిల్లాలో ఈ నాలుగు రోజుల్లో ఇప్పటి వరకు 1,38,244 హౌస్ హోల్డ్స్‌ను కవర్ చేస్తూ 131 గ్రామ పంచాయతీలు, 34 మున్సిపల్ వార్డుల్లో గ్రామ సభలు నిర్వహించినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ స్కీంలకు సంబంధించి 1,36,336 మంది దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కాగా, ధర్మసాగర్ మండలంలోని మల్లక్‌పల్లె గ్రామ సభను మంగళవారం కలెక్టర్ సిక్తా పట్నానాయక్ పరిశీలించారు. జడ్పీసీఈవో వెంకటేశ్వర్‌రావు, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో జవహర్‌రెడ్డి, సర్పంచ్ మునిగెల రాజు పాల్గొన్నారు. అలాగే, గ్రేటర్ పరిధి 47,48, 49 డివిజన్లలో ప్రజా పాలన కార్యక్రమాన్ని కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, కార్పొరేటర్లు రవీందర్‌యాదవ్, సయ్యద్ విజయశ్రీ రజాలి, మానసా రాంప్రసాద్‌తో కలిసి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పరిశీలించారు. ఆరు గ్యారెంటీ స్కీంలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, వర్ధన్నపేట మండలం చెన్నారంలో జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. కాగా, ఇక్కడ జరిగిన గ్రామసభలో వేదికపై కాంగ్రెస్ నాయకులు కూర్చోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు పార్టీ నాయకులు కూర్చున్నారు. దీంతో పలువురు మండల స్థాయి అధికారులు వెనకాల కూర్చోవాల్సి వచ్చిందనే విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా సభలో తీవ్ర జాప్యం జరగడంతో ప్రజలు అసహనానికి గురయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ భిక్షపతి, సర్పంచ్ పునుగోటి భాస్కర్‌రావు, మండల ప్రత్యేక అధికారి సురేశ్‌కుమార్, తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎంపీడీవో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. అలాగే, హసన్‌పర్తి మండలం నాగారంలో దరఖాస్తుల స్వీకరణను ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించారు. స్పెషల్ ఆఫీసర్ ఈఈ శంకరయ్య, తహసీల్దార్ చల్లా ప్రసాద్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో రవిబాబు, ఏపీవో విజయలక్ష్మి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెసరు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ అరుణ్ పాల్గొన్నారు. అలాగే, ఐనవోలు మండలం నందనంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగరాజు హాజరయ్యారు. జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ లక్ష్మి, ఎంపీవో రఘుపతిరెడ్డి, ఏపీవో రాజ్‌కుమార్, కార్యదర్శి వెంకన్న, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. నర్సంపేట మండలం లక్నేపల్లి, ముగ్దుంపురం, దాసరిపల్లిలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జీ జీవరత్నం, తహసీల్దార్ విశ్వప్రసాద్, ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావు, ఐకేపీ ఏపీఎం కుందేళ్ల మహేందర్, ఎంపీవో సునీల్‌కుమార్‌రాజ్ పాల్గొన్నారు. పరకాల మండలం వెల్లంపల్లి, పోచారంతో పాటు గీసుగొండ మండలం మరియపురం, కొమ్మాల గ్రామాల్లో దరఖాస్తు కేంద్రాలను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరిశీలించారు. పరకాల ఎంపీపీ స్వర్ణలత, గీసుగొండ తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో వీరేశం, ఎంపీపీ సౌజన్య, సర్పంచులు అల్లం బాలిరెడ్డి, వీ కవిత, ఎంపీబీవో ప్రభాకర్ పాల్గొన్నారు. కాగా, గ్రేటర్ 15వ డివిజన్ మొగిలిచెర్లలో ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బెజ్జల కుమారస్వామి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల కోసం ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆకుల మనోహర్, నాయకులు భూతం హరీశ్, కిరణ్ పాల్గొన్నారు.

గీసుగొండ : మొగిలిచెర్లలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్పొరేటర్, అధికారులు

పరకాల : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఫ్లెక్సీలో ఫొటోలు లేవని చింపివేత

ఐనవోలు : మండలంలోని నందనం గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు స్వాగతం పలుకుతూ కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో మంగళవారం ఉదయం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే, ఫ్లెక్సీల్లో తమ పోటీలు పెట్టలేదని కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఆగ్రహంతో వాటిని చించేశారు. దీంతో నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. మండల నాయకులు కలుగజేసుకొని ఇలాంటి పొరపాట్లు మళ్లీ జరగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

ఫ్లెక్సీని చింపుతున్న కాంగ్రెస్ నాయకులు

వంద రోజుల్లో గ్యారెంటీల హామీలను నిలుపుకోవాలి

- అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు, జనవరి 2 : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను వంద రోజుల్లో నిలుపుకోవాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని మల్లికుదుర్లలో మంగళవారం గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు ఇస్తామన్నారు. దరఖాస్తులో వివరాలపై స్పష్టత లేదన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ లిఖిత పూర్వకంగా లేఖ రాసి కలెక్టర్‌కు తెలియాజేయాలన్నారు. యువ వికాసంలో నిరుద్యోగ భృతికి సంబంధించిన వివరాలను తెలియజేయలేదన్నారు. అంతే కాకుండా రైతు భరోసాలో పట్టాదారు రైతు, కౌలు రైతులకు ఒకే సర్వే నంబర్లు ఉంటాయని దీనితో ఒకే భూమికి సంబంధించిన సర్వే నంబర్లు ఇద్దరికి ఒకే రకంగా ఉండడం వల్ల ఎవరికి వర్తిస్తుందనే సందేహం నెలకొందన్నారు. క్షేత్ర స్థాయిలో పథకాలను అమలు చేసేటప్పుడు ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సమ్మిరెడ్డి, జడ్పీటీసీ చాడ సరిత, తహసీల్దార్ కోమి, ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, సర్పంచ్ రాజిరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ సురేశ్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా, మల్లికుదుర్లలో శత వృద్ధురాలు భట్టు సాయమ్మ మృతి చెందగా ఎమ్మెల్యే శ్రీహరి ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ రాజిరెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

'ప్రజా పాలన' గందరగోళం

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్

వరంగల్, జనవరి 2: ప్రజా పాలనలో గందరగోళం నెలకొన్నది. క్షేత్రస్థాయిలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రంలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, గ్రేటర్ కమిషనర్ ఆదేశాలు బేఖాతార్ చేస్తున్నారని ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పూర్తి చేసిన ఫారాలను గ్రేటర్ పరిధిలోని ఏ కేంద్రంలోపైనా ఇవ్వవచ్చు అని గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ ప్రకటించినా క్షేత్రస్థాయిలో సిబ్బంది తీసుకోవడం లేదు. ఏ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఆ డివిజన్‌కు సంబంధించిన దరఖాస్తులనే స్వీకరిస్తున్నారు. దీంతో కమిషనర్ ప్రకటనతో వచ్చిన ఇతర డివిజన్ల ప్రజలను తిరిగి పంపిస్తున్నారు. ప్రజాపాలనపై క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి స్పష్టత లేకపోవడం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నాలుగో రోజు గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్లలో 1,45,677 దరఖాస్తులు వచ్చాయి. గ్యారెంటీలకు 1,20,145, రేషన్‌కార్డుల కోసం 11,509, ఇతర సమస్యలపై 14,023 దరఖాస్తులు వచ్చినట్లు గ్రేటర్ కమిషనర్ ప్రకటించారు.

సంకల్ప బలమే గొప్పది : కేయూ వీసీ

హనుమకొండ చౌరస్తా, జనవరి 2: సంకల్ప బలమే గొప్పదని కేయూ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. విశ్వవిద్యాలయ సెనెట్‌హాల్ ఉద్యోగులతో నూతన సంవత్సరం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 2023లో విశ్వవిద్యాలయం గొప్ప విజయాలు సాధించిందన్నారు. వాటిలో న్యాక్ ఏ ప్లస్ గ్రేడింగ్, స్నాతకోత్సవ నిర్వహణ, బయోటెక్నాలజీ విభాగంలో అంతర్జాతీయ సదస్సు, పీహెచ్‌డీ ప్రవేశాలు, గ్రీన్‌మెట్రిక్స్ ర్యాంకింగ్, 82వ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ ఇలా ఎన్నో మైలు రాళ్లను దాటిందన్నారు. 2024లో స్నాతకోత్సవం నిర్వహిస్తామని, మార్చి 21, 22, 23 తేదీల్లో ఆంత్రోపాలజీలో అంతర్జాతీయ సదస్సు, ఇతర అకడమిక్ కార్యక్రమాలు చేపడుతామని వెల్లడించారు. ఉద్యోగుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. అలాగే, బస్కుల సునీల్, నారగోని శివాజీగౌడ్‌కు కారుణ్య నియామక పత్రాలు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, సహాయ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్ బాబుతో కలిసి వీసీ అందజేశారు.

అంత్యక్రియలు చేయాలని మృతురాలి బంధువుల ఆందోళన

నడికూడ, జనవరి 2 : భార్య మృతి చెందినా పట్టించుకోకుండా పోయిన భర్త ఆమె అంత్యక్రియలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మృతురాలి బంధువులు రోడ్డుపై ధర్నా చేసిన ఘటన మండలంలోని ధర్మారంలో చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. మాదన్నపేటకు చెందిన నక్క లక్ష్మి(35)కి ధర్మారం గ్రామానికి చెందిన నక్క ఎర్రయ్యతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కూతురు పుట్టిన తర్వాత కొంత కాలానికి ఎర్రయ్య భార్యను దూరం పెట్టాడు. లక్ష్మి ధర్మారంలోనే వేరే ఇంటిలో కూతురుతో జీవిస్తున్నది. కాగా, ఐదు రోజుల క్రితం లక్ష్మి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. అయితే, భార్య ఉండగానే వేరొకరిని పెండ్లి చేసుకున్న ఎర్రయ్య తనకు ఉన్న రెండు ఎకరాల్లో కూతురుకి కొంత ఇవ్వాలని మృతురాలి కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ధర్మారం రోడ్డుపై ధర్నా చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని వారికి నచ్చజెప్పినా వినలేదు. వాహనాలు స్తంభించిపోవడంతో వారిని చెదరగొట్టారు. ఎర్రయ్యతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని సీఐ వెంకటరత్నం వారికి సూచించారు.

పోలీసులను ఆశ్రయించిన బైరి నరేశ్

కమలాపూర్, జనవరి 2 : మూఢనమ్మకాల నిర్మూలన సంఘం అధ్యక్షుడు బైరి నరేశ్ పోలీసులను ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ములుగు జిల్లా ఏటూరునాగారంలో తనపై అయ్యప్ప మాలధారులు, బీజేపీ మతతత్వవాదులు దాడి చేశారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. మంగళవారం నరేశ్ తన స్వగ్రామం రాములపల్లి వచ్చారు. అయ్యప్ప మాలధారుల నుంచి రక్షణ కల్పించాలంటూ కమలాపూర్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో సీఐ సంజీవ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

ఖిలావరంగల్, జనవరి 2: మద్యానికి బానిసైన యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. జీఆర్పీ సీఐ నరేశ్ కథనం ప్రకారం.. ఉర్సు బొడ్రాయికి చెందిన పొక్కుల నరేశ్(36) మద్యానికి బానిసై ఇంట్లో ఖాళీగా ఉంటున్నాడు. మానసిక సమస్యలతోపాటు జీవితంపై విరక్తి చెందిన అతడు హంటర్ రోడ్డులోని మినీ అండర్ బ్రిడ్జి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంజీఎం మార్చురీలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ చెప్పారు.

రెండు టిప్పర్ల పట్టివేత

దామెర, జనవరి 2: మండలంలోని ఒగ్లాపురం సైలానీబాబా దర్గా వద్ద మంగళవారం అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్ లారీలను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పసరగొండలోని ఓ క్రషర్ నుంచి మొరంను హనుమకొండకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు పట్టుకొని టిప్పర్ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

గిర్మాజీపేట, జనవరి 2 : పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్న ఘటన ఇంతెజార్‌గంజ్ స్టేషన్ పరిధిలోని కొత్తవాడలో మంగళవారం జరిగింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. కొత్తవాడలో కొంతమంది పేకాడుతున్నారనే సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది దాడి నిర్వహించారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు రూ. 4,750 నగదు, కార్డులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తవాడకు చెందిన దేవర రాము, బయ్య సాంబ, రాగం ఆదినారాయణ, కర్రె రవిని అదుపులోకి తీసుకున్నారు. గొండా అనిల్‌కుమార్, పూర్ణచందర్‌రావు, పవన్ పరారైనట్లు తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ లవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హనుమకొండ సబర్బన్, జనవరి 2 : వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ సంస్థ డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలు, ఉద్యోగులు, అన్ని ఉద్యోగ సంఘాల నాయకులు, ట్రేడ్ యూనియన్లు, అసోసియేషన్ నాయకులు మంగళవారం సీఎండీకి పుష్పగుచ్ఛం అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ ఆర్థికాభివృద్ధికి కలిసికట్టుగా పని చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించడం, ఏటీ అండ్ సీ నష్టాలను తగ్గించాలని కోరారు. అలాగే తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నార్ల సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు సీఎండీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీపీడీఈఏ సర్కిల్ సెక్రటరీ అనిల్‌కుమార్‌రెడ్డి రచించిన నర్సంపేట కథలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బీ వెంకటేశ్వరరావు, పీ గణపతి, పీ సంధ్యారాణి, మోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, జనార్దన్, ఇంద్రాసేనారెడ్డి, మల్లికార్జున్, జ్యోతిర్మయి, వంశీకృష్ణ, అనిల్‌కుమార్‌రెడ్డి, రాజు, సతీశ్, వరుణ్ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

ఆత్మకూరు/శాయంపేట : టీఎస్‌ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి సీఐటీయూ ఆధ్వర్యంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, తిరుపతిరెడ్డి, సీఐటీయూ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్, కార్మికులు బూర వరుణ్, అబ్బోజు పూర్ణాచారి, అక్కినపల్లి అరుణ్‌కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, జనవరి 2: జిల్లా అభివృద్ధికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం జిల్లాకు చెందిన పలువురు అధికారులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు, నోట్ బుక్స్ అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, మహేందర్ జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్వో వైవీ గణేశ్, డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, పరకాల ఆర్డీవో శ్రీనివాస్, హనుమకొండ తహసీల్దార్ విజయ్ కుమార్, డీఎంహెచ్‌వో సాంబశివరావు, డీటీసీ పురుషోత్తం, వివిధ శాఖల అధికారులు, రెడ్ క్రాస్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రైస్ మిల్లర్లు, ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు ఉన్నారు. అలాగే, కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల కోసం నోట్ బుక్స్‌ను అందజేశారు. అలాగే, ఉద్యోగ సంఘాల నేతలు. టీజీవో నాయకులు ఎంవీఐ కంచి వేణు, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, హరిప్రసాద్, రాజేశ్‌కుమార్ తదితరులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలపాలి

వరంగల్ కలెక్టర్ పీ ప్రావీణ్య

ఖిలావరంగల్, జనవరి 2: సరికొత్త ప్రణాళికలతో జిల్లాను అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు జిల్లా అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ పీ ప్రావీణ్య సూచించారు. వరంగల్ కలెక్టరేట్‌లోని జిల్లాస్థాయి అధికారులు, సిబ్బంది మంగళవారం కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్, ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో సభ్యులు కలెక్టర్‌ను కలిశారు. తర్వాత టీఎన్జీవోస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆర్డీవో వాసుచంద్ర, ఏవో శ్రీకాంత్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీపీఆర్‌వో అయుబ్ అలీ, బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, డీపీవో కల్పన, ఎస్సీ వెల్ఫేర్ అధికారి భాగ్యలక్ష్మి, రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ కూడా కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్లు బండి నాగేశ్వర్‌రావు, ఫణికుమార్, రాజేశ్‌గౌడ్, కిరణ్‌కుమార్ ఉన్నారు.

31లోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

హనుమకొండ, జనవరి 2: జిల్లాలో రైస్ మిల్లర్లు ఈ నెల 31లోగా సీఎంఆర్(కస్టం మిల్లింగ్ రౌస్)ను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో జిల్లా నుంచి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారికి అందజేయాల్సిన బియ్యంపై పౌర సరఫరాల శాఖ అధికారులు, రైస్ మిలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ వసంతలక్ష్మి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం మహేందర్, డీటీ సీఎస్‌లు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

పోలీసులకు ప్రతిభా అవార్డులు

అభినందించిన పోలీసు ఉన్నతాధికారులు

సుబేదారి, జనవరి 2 : విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు రకాల పథకాలు శౌర్య, మహోన్నత, ఉత్తమ, కఠిన, సేవా పథకాలను కొత్త ఏడాది ప్రకటించింది. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరికి ఉత్తమ పథకాలు, 23 మందికి సేవా పథకాలు వచ్చాయి. వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బిట్ల సోమయ్య, 4వ బెటాలియన్ మామునూర్ పీటీసీలో పనిచేస్తున్న ఏఆర్ ఇన్‌స్పెక్టర్ కే చంద్రన్నకు ఉత్తమ సేవా పతకాలు లభించాయి. 23 మంది సేవా పతకాలు పొందిన వారిలో వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సీసీఆర్‌బీ విభాగంలో పనిచేస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గుండెబోయిన రాజు, సుబేదారి ఎస్సై ఎండీ గాలిబ్, ఏఆర్ఎస్సై అనంతుల సుధాకర్, ఇంతేజార్‌గంజ్ ఏఎస్సై మేకల రమేశ్, ఆర్ ఎస్సై పూస సంపత్‌కుమార్, చెన్నారావుపేట ఏఎస్సై కే వెంకన్న, ఖానాపూర్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఏ కుమారస్వామి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ గౌస్‌పాషా, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ చింతలచెరువు నాగసోమశ్వర్‌రెడ్డి, ధర్మసాగర్ హెడ్ కానిస్టేబుల్ ఎం దస్తగియ, ఏఆర్ పీసీలు మాతరాసి సారంగం, పోతుల ఉప్పలయ్య, పొగాకుల శ్రీనివాస్, గీసుగొండలో పనిచేస్తున్న ఎం రత్నయ్య, సంగెంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ సీహెచ్ కుమారస్వామి, మడికొండ పోలీసు ట్రైనింగ్ కాలేజ్ ఎస్సై బీ రాజన్‌బాబు ఉన్నారు.

ఇంటెలిజెన్స్ విభాగంలో..

వరంగల్ రీజియన్‌లో పనిచేస్తున్న డీఎస్పీ ఏ సత్యనారాయణ, ఏఎస్సై దామెరుప్పల సుదర్శన్, హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ అన్వర్ సిద్దిఖీ, జీ నర్సయ్య, దాసరి ప్రసాద్, టెక్నికల్ సర్వీస్ విభాగంలో వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలోని ఐటీ కోర్‌లో పనిచేస్తున్న ఏఎస్సై వీ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ఫైర్ విభాగంలో..

అగ్నిమాపక శాఖలో వరంగల్ రీజియన్‌లో పనిచేస్తున్న ముగ్గురికి సేవా అవార్డులు లభించాయి. వరంగల్ మట్టెవాడ ఫైర్ స్టేషన్‌లో డ్రైవర్, ఆపరేటర్ పనిచేస్తున్న పీ సురేందర్, పరకాలలో అగ్నిమాపక స్టేషన్‌లో పనిచేస్తున్న ఫైర్ మెన్స్ కే సతీశ్, ఎన్ రాజుకు సేవా పతకాలు వచ్చాయి. వారిని ఉన్నతాధికారులు అభినందించారు.

హరీశ్‌రావును కలిసిన బీఆర్‌ఎస్ నేతలు

హనుమకొండ, జనవరి 2 : నూతన సంవత్సరం సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును బీఆర్‌ఎస్ జిల్లా నేతలు కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, బీరెల్లి భరత్‌కుమార్ పాల్గొన్నారు.

హరీశ్‌రావుకు పూల మొక్కలు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

'ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి'

వరంగల్ చౌరస్తా, జనవరి 2: ఎంజీఎం దవాఖానలోని పలు విభాగాల్లో విద్యుత్ మరమ్మతు కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూపరింటెండెంట్ విభాగాధిపతులకు మంగళవారం సర్క్యూలర్ జారీ చేశారు. ఇటీవల షార్ట్ సర్క్యూట్ వల్ల పాడైపోయిన వైరింగ్‌ను తొలగించి మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్ఎంవో డాక్టర్ అప్పాల ప్రసాద్ పర్యవేక్షణలో బుధవారం ఎంఎస్ఈ వార్డు, ఎంఎస్‌డబ్ల్యూ, ఐసీఎస్‌యూ, ఎన్ఎంఎస్‌డబ్ల్యూ, బర్న్స్ వార్డు, ఎఫ్ఎం-1, ఎఫ్ఎం-3, సీఎస్ఎస్‌డీ వార్డులతోపాటు ఆరోగ్యశ్రీ వార్డు, డైట్ కిచెన్‌లో మరమ్మతు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సూపరింటెండెంట్ విభాగాధిపతులు, నర్సింగ్ సిబ్బందికి ముందస్తు సూచన చేశారు.

డిగ్రీ పరీక్షల్లో 17 మంది డిబార్

హనుమకొండ చౌరస్తా, జనవరి 2: కేయూ పరిధిలో మంగళవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 17 మంది డిబార్ అయినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి పీ మల్లారెడ్డి తెలిపారు. ఇందులో ఆదిలాబాద్-5, ఖమ్మం-4, వరంగల్-8 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపీ దయాకర్

ఖిలావరంగల్, జనవరి 2: లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాల విద్యార్థులు బ్రెయిలీ లిపిలో తయారు చేసిన క్యాలెండర్‌ను క్యాంపు కార్యాలయంలో ఎంపీ పసునూరి దయాకర్, వరంగల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ పీ ప్రావీణ్య వేర్వేరుగా మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నలివెల కల్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన పెద్ది

నర్సంపేట, జనవరి 2: నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మంగళవారం నర్సంపేటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎన్నారై సెల్ కన్వీనర్, నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బావుపేట రైల్వే గేటు మూసివేత

కమలాపూర్, జనవరి 2: కమలాపూర్-హనుమకొండ రోడ్డు మార్గంలో ఉన్న బావుపేట రైల్వేగేటు రెండు రోజులపాటు మూసివేస్తున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ మంగళవారం తెలిపారు. మూడో లైన్ నిర్మాణంలో భాగంగా ఈనెల 4,5తేదీల్లో రైల్వేగేటు మూసివేస్తామన్నారు. వాహనదారులు గమనించాలని కోరారు.